కడుపు మంటతో డేంజర్

ప్రత్తిపాడుకు చెందిన సుబ్బారావు గత కొంతకాలంగా తీవ్ర కడుపు మంటతో బాధపడుతున్నాడు. ఉద్యోగ రీత్యా రాత్రి సమయాల్లో ఎక్కువ కాలం మేలుకొని ఉండటం, సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడంతో ఈ మధ్యకాలంలో సమస్య తీవ్రమై వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్ష చేసి సుబ్బారావు ఇన్‌ఫ్లామేటరీ బోవెల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు.

గుంటూరు శ్రీనగర్‌కు చెందిన రాకేష్ ఇంజినీరింగ్ అభ్యసిస్తున్నాడు. ఇటీవల తీవ్రమైన కడుపు మంటతో ఆస్పత్రిలో చేరాడు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పరీక్షించారు. విద్యార్థి ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం, సకాలంలో ఆహారం తీసుకోకుండా చదువు ధ్యాసలో పడి ఒత్తిడికి గురవడం ద్వారా ఐబీడీ వ్యాధి బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.

ఇన్‌ఫ్లామేటరీబోవెల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. సకాలంలో చికిత్స తీసుకోని పక్షంలో దీర్ఘకాలం వ్యాధి వేధిస్తుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పదివేల మిలియన్లకంటే ఎక్కువ మంది వ్యాధి బాధితులు ఉన్నట్లు ది యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ క్రోన్స్ అండ్ అల్సరేటివ్ కొలిటీస్ అసోసియేషన్ పేర్కొంది. ఈ వ్యాధిని నియంత్రణలో పెట్టడం తప్ప పూర్తిగా నయం చేయలేరు. ఐబీడీ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు 2010 నుంచి మే 19న ప్రపంచ వ్యాప్తంగా ఐబీడీ డే నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' కథనం. –గుంటూరు మెడికల్

రేపు ఐబీడీ డే
- వ్యాధిఅవగాహన కలిగి ఉండాలి
- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధికి దూరం





ఐబీడీ పోస్టర్లు

వ్యాధి లక్షణాలు

క్రాన్స్ వ్యాధి, అల్సరేటివ్ కొలిటీస్ వ్యాధులనే ఐబీడీ వ్యాధిగా పిలుస్తారు. వాంతులు, విరోచనాలు, కొన్ని సార్లు రక్తపు విరోచనాలు, కడుపులో నొప్పి, అకస్మాత్తుగా శరీరం బరువు కోల్పోవడం, కడుపులో మంట, కడుపులో తిమ్మరి, అత్యవసరంగా మల విసర్జనకు వెళ్లాలనిపించడం, జ్వరం ఈ వ్యాధి లక్షణాలు. వ్యక్తులను బట్టి వ్యాధి లక్షణాలు మారుతూ ఉంటాయి.

కారణాలు..

ఐబీడీ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, జన్యుపరమైన కారణాలు, జీవన విధానం, కొన్ని రకాల మందులు మింగడం ద్వారా, ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం ద్వారా, ధూమపానం, మద్యపానం, ఒత్తిడి వ్యాధి కారణాలు.

బాధితులు..

15 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి బాధితులే. కొంత మంది 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసులో వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

గుంటూరు జిల్లాలో పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడు వారంలో ఇద్దరు లేదా, ముగ్గురు ఐబీడీ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో 2020లో 480 మంది, 2021లో 816 మంది, 2022లో 960 మంది, 2023లో 986 మంది బాధితులు చికిత్స పొందారు. ప్రతి ఏడాది వ్యాధి బాధితుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు సూచిస్తున్నారు.

నిర్ధారణ ఇలా..

ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఎమ్మారై, రక్త పరీక్షలు, సీటీ స్కాన్, మలహర్ష ద్వారా ఐబీడీ వ్యాధి నిర్ధారిస్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



ప్రతిరోజూ ఒత్తిడిని దూరం చేసుకునేందుకు వ్యాయామం, ధ్యానం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. ధూమపానం, మద్యపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. సమీకృత ఆహారాన్ని సక్రమంగా నమిలి మింగాలి. సరైన వేళల్లో ఆహారాన్ని తీసుకోవాలి. తిన్న వెంటనే నిద్రించకూడదు. రాత్రివేళల్లో త్వరితగతిన ఆహారం తినాలి. పాల ఉత్పత్తులు పరిమితి మోతాదులో తీసుకోవాలి. కాఫీ, టీలు, శీతల పానీయాలకు దూరంగా ఉండాలి.

–డాక్టర్ షేక్ నాగూర్‌బాషా,
గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

క్లుప్తంగా

ఉపాధి పనులు వేగవంతం



ఫిరంగిపురం: మండలంలోని 18 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేసినట్లు ఏపీఓ విజయకుమార్ శుక్రవారం తెలిపారు. అన్ని గ్రామాల్లోని పంట పొలాలకు నీరు వెళ్లేందుకు వీలుగా పంట కాలువలలో పూడికతీత పనులు కూలీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా వర్షం నీరు పంట పొలంలో తీసిన కుంటల్లో నిలువ ఉండటం ద్వారా పంటకు సరిపడా నీరు లభిస్తుందని చెప్పారు. రైతులు తమ పంటపొలాల్లో నీరు నిల్వ ఉండేలా కుంటలు తీయిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు 4,300 నుండి 5 వేల వరకు కూలీలు పనులు చేస్తున్నారని చెప్పారు.

జాగ్రత్తలతో డెంగీ దూరం

ఫిరంగిపురం: తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డెంగీ వ్యాధికి దూరంగా ఉండవచ్చని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఎస్తేరు రాణి అన్నారు. మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 232 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మంచినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కుండలు, బిందెలు వద్ద ఉన్న ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల ప్రదేశాలు శుభ్రంగా ఉండేలా చూడాలని చెప్పారు.

ఉండవల్లి- అమరావతి కరకట్టపై రోడ్డు ప్రమాదం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి కృష్ణానది ఎగువ ప్రాంతంలోని అమరావతి కరకట్ట తపోవనం వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వేర్వేరుగా వెళుతున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ప్రకాశం బ్యారేజ్ నుంచి అమరావతి కరకట్టపై వేగంగా వెళ్తున్న ఓ గూడ్స్ ఆటో అమరావతి నుంచి ప్రకాశం బ్యారేజ్ వైపు వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వెలగపూడికి చెందిన శ్రీనివాసరావుకు కుడి కాలు విరిగింది. వెనుక మరో ద్విచక్ర వాహంపై వస్తున్న వెంకటపాలేనికి చెందిన మరియబాబుకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరిద్దరిని కరకట్టపై ప్రయాణించే వారు 108కు సమాచారం ఇచ్చి వైద్య నిమిత్త విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన వేసవి శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. శుక్రవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసి, వారికి ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు వేసవి శిక్షణ శిబిరాన్ని వేదికగా మార్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

డాక్టర్ భగవన్నారాయణ మృతి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ పి.భగవన్నారాయణ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. రామన్నపేటలోని ఆయన నివాసంలో డాక్టర్ భగవన్నారాయణ మృతదేహాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. డాక్టర్ భగవన్నారాయణ మృతి పట్ల వైద్యులు, వైద్య సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

19న పాటల పోటీలు

తెనాలి: తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా ఈనెల 19వ తేదీన స్థానిక బోసు రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని గీతా మందిరంలో అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఉదయం పోటీలు నాలుగు కేటగిరీల్లో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగల వారు 9246440685లో సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

డాక్టర్ నజీరుద్దీన్‌కు సన్మానం



డాక్టర్ నజీరుద్దీన్‌ను సన్మానిస్తున్న డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు మెడికల్: యువనారీ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ పేదల వైద్యుడిగా మన్ననలు పొందిన సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ పదివేలకు పైగా ఆపరేషన్లు పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం ఆయనకు ఘన సన్మానం చేశారు. స్థానిక గుంటూరువారితోటలోని హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా, డాక్టర్ రాహుల్‌రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ విజయప్రకాష్, డాక్టర్ ఆనంద్, హాస్పిటల్ మేనేజర్ పి.వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ పేదలకు సేవ చేసే అవకాశం తనకు దక్కవడం భగవంతుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నానని చెప్పారు. యువనారీ హెల్త్ కేర్ ట్రస్టు, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదేళ్లుగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వివరించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో సర్జరీ వైద్య విభాగంలో సేవలందించే అవకాశం తనకు లభించడం దేవుడు ఇచ్చిన వరం అన్నారు. కేవలం రూ. 10 ఓపీతో హోప్ విన్ హాస్పిటల్స్‌లో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. వైద్య పరీక్షలు, మందుల్లో కూడా పేదలకు రాయితీ అందిస్తున్నామని వివరించారు. డబ్బులు కారణంతో పేదవారు వైద్యానికి దూరం కాకుండా ఉండకూడదనే మంచి ఆలోచనతో హోప్ విన్ హాస్పిటల్‌లో నిరంతరం రూ.10 ఓపీతో వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ సర్జన్‌గా వైద్య వృత్తిలోకి ప్రవేశించి 14 ఏళ్లు పూర్తయిన డాక్టర్ నజీరుద్దీన్, పదివేలకు పైగా సర్జరీలు చేసి ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడారన్నారు. భవిష్యత్‌లో కూడా తమ ట్రస్టు సేవలు మరింత విస్తృతం చేస్తామని, పేదల ఆరోగ్య భరోసా లక్ష్యంతో తాను వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.

బీపీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



బీపీ పరీక్ష చేయించుకున్న డాక్టర్ కె.రాజ్యలక్ష్మి

గుంటూరు మెడికల్: వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా శుక్రవారం గుంటూరులోని జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బందికి బీపీ పరీక్షలు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, బీపీ పరీక్ష చేయించుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఈఏడాది రక్తపోటును కచ్చితంగా కొలిచి, నియంత్రణలో ఉంచుకొని, ఎక్కువకాలం జీవించండి' అనే నినాదంతో వరల్డ్ హైపర్ టెన్షన్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది అందరూ బీపీ పరీక్ష చేయించుకోవాలని కోరారు. బీపీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వాలని చెప్పారు. ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు, ప్రతిరోజూ 30 నిమిషాలు నడక, వ్యాయామం, ధ్యానం, యోగ చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. బీపీ సైలెంట్ కిల్లర్ అని, అప్రమత్తంగా లేకపోతే పక్షవాతం, హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీస్తుందని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ బీ.పీ విషయంలో అవగాహన కలిగి ఉండి ఆరోగ్య సూత్రాలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్సీడీ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, డీఐఓ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డాక్టర్ గిరిధర్, డాక్టర్. టి.అఖిల్ నిశాంత్ పాల్గొన్నారు.

సుబ్బారావుకు ప్రజా సంఘాల నేతలు నివాళి



మాట్లాడుతున్న నరసింహారావు

లక్ష్మీపురం: సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సీనియర్ నేత రాగి సుబ్బారావు సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. గుంటూరు సంగడిగుంట బీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి వేల్పూరి నరసింహారావు అధ్యక్షత వహించారు. తొలుత రాగి సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేల్పూరి నరసింహారావు మాట్లాడుతూ రాగి సుబ్బారావు ఐదు దశాబ్దాలుగా పీడిత ప్రజల ఉద్యమాల్లో కీలకమైన బాధ్యతలు నిర్వహించారన్నారు. పార్టీ నాయకులు పి.ప్రసాద్, ఎం.భార్గవశ్రీ,, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, డి.రమాదేవి, మన్నవ హరి ప్రసాద్, విరసం నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్, ఇతర పార్టీల నాయకులు పి.కోటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రముఖ సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు, ప్రొఫెసర్ షేక్ అబ్దుల్ నూర్ బాషా, కాలువ శ్రీధర్, భాస్కరరావు, సురేష్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వినయకుమార్, కె.విల్సన్, ఎం .సుబ్బారావు, సాంబశివరావు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

తెనాలిరూరల్: మద్యానికి బానిసై యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల అందించిన వివరాలు.. పట్టణ నందుల పేటకు చెందిన మణి(23) మద్యంకు బానిసయ్యాడు. ఖర్చులకు డబ్బులు చాలకపోతుండడంతో గురువారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు తెనాలి వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్ తెలిపారు.

లాడ్జిల్లో నిబంధనలు పాటించాలి

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా లాడ్జిల నిర్వాహకులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా హెచ్చరించారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని లాడ్జిల యజమానులు, మేనేజర్లతో సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు. అన్వర్‌బాషా మాట్లాడుతూ లాడ్జి నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్టారు మెయిన్‌టెన్ చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించి తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్క లాడ్జి యజమాని కచ్చితంగా కస్టమర్లకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న తరుణంలో లాడ్జిల్లో సంఘ విద్రోహక శక్తులు వచ్చే అవకాశం ఉందని, దానిపై లాడ్జిల యజమానులు, మేనేజర్లు పోలీసులకు సహకరించాలని కోరారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రజాస్వామ్యవాదులకు ఊరట

లక్ష్మీపురం: న్యూస్ క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్తా అరెస్టు చెల్లదని, తక్షణమే ఆయన్ను విడుదల చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యవాదులకు గొప్ప ఊరట అని అవగాహన సంస్థ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సమకాలీన రాజకీయాలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త వి.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్‌పై బనాయించిన కేసులకు సంబంధించి దర్యాప్తు సంస్థ ఏ ఒక్క ఆధారం చూపలేకపోయిందన్నారు. న్యాయవాది అవధానుల హరి మాట్లాడారు. కార్యక్రమంలో సింగయ్య, రవిబాబు, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లాక్కొని పరారైన ఘటనపై కేసు

పట్నంబజారు: వ్యక్తి చేతిలో సెల్‌ఫోన్ లాక్కొని పరారైన ఘటన గుంటూరులో చోటు చేసుకుంది. బాధితుడి సమాచారం మేరకు పాతగుంటూరుకు చెందిన గురునాథం పాతబస్టాండ్ సెంటర్‌లో నడుచుకుంటూ వెళుతున్నాడు. ద్విచక్ర వాహనంపై నంబరు ప్లేట్ లేకుండా వచ్చిన ముగ్గురు వ్యక్తులు తాను సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ నడుచుకుంటూ వెళుతుండగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కాబా- మదీనా నమూనాల ప్రదర్శన

తెనాలి: హజ్ యాత్రను పురస్కరించుకుని మదీనా మదర్సాకు చెందిన చిన్నారులు ముస్లింలకు అతి పవిత్ర క్షేత్రాల నమూనాలను తీర్చిదిద్దారు. సౌదీ అరేబియాలోని దైవగృహంగా పేర్కొనే కాబా, మదీనా మసర్జా నమూనాలను రూపొందించారు. స్థానిక వహాబ్ రోడ్‌లోని మదీనా మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు హాజీ షేక్ యాఖూబ్, కార్యదర్శి షేక్ చాంద్‌బాషా, ఇమామ్ ముఫ్తీ, ఉస్మాన్ సాహెబ్, హఫీజ్ అల్కామా పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



విద్యార్థులతో నిర్మల ఫార్మసీ కళాశాల యాజమాన్యం, ఆప్టమ్ కంపెనీ ప్రతినిధులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి రూరల్ ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రముఖ బహుళ జాతీయ సంస్థ ఆప్టమ్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారని, వివిధ పరీక్షల అనంతరం 36 మందిని ఎంపిక చేశారని తెలిపారు. నిర్మల ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ సిస్టర్ నిర్మల జ్యోతి మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన 14 మంది ప్రాంగణ ఎంపికల్లో ఎంపికయ్యారని వీరి వార్షిక వేతనం రూ.2.11 లక్షలుగా ఉందని వివరించారు. కార్యక్రమంలో ఆప్టమ్ కంపెనీ ప్రతినిధులు విజయరామన్, పవన్, రుత్విక్, లక్ష్మణ్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కామేశ్వరరావు, సమన్వయకర్తలు డాక్టర్ సుధీర్, జోజిబాబు, సాంకేతిక సిబ్బంది అశోక్ కుమార్, విజయ్‌కుమార్, వేముల శ్రీహరి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలి



అధికారులతో సమావేశమైన నగర కమిషనర్, తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి

నగర కమిషనర్, తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీ, సమయంపై పోటీ చేసిన అభ్యర్థులకు నోటీసు ద్వారా సమాచారం అందించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, పోటీ చేసిన రాజకీయ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులకు లెక్కింపు తేదీ, సమయం గూర్చిన వివరాలను నోటీసు ద్వారా సమాచారం అందించాలని కోరారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పాటు గుంటూరు తూర్పు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జరిగే యూనివర్సిటీలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు. సెక్టార్, పోలింగ్ కేంద్రాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేర్వేరుగా మార్గాలు ఉండాలన్నారు. అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సీసీ కెమెరాలు స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, సదరు విజువల్స్‌ని యూనివర్సిటీ ప్రాంగణంలోని కంట్రోల్ రూమ్‌లో చూడవచ్చని అభ్యర్థులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్ చెక్ లిస్ట్ సిద్ధం చేయాలని, కౌంటింగ్ విధులకు అధికారులను, సిబ్బందిని కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ తయారు చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. నగరపాలక సంస్థలోని పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం పోలీస్ భద్రత ఉండేలా మేనేజర్ ప్రసాద్, సూపరింటెండెంట్ శివన్నారాయణ సమన్వయం చేసుకోవాలని సూచించారురు. టేబుళ్ల వారీగా, రౌండ్ల వారీగా ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లు, కంప్యూటర్లు, తగిన ఇంటర్ నెట్ సదుపాయం, వీడియోగ్రాఫర్లను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్ కుమార్, భీమరాజు, వెంకట లక్ష్మి, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యామ్ సుందర్, ఈఈ సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రైలులో జనరల్ బోగీల కోసం కోటి ఉత్తరాలు



ప్రధాన మంత్రికి రాసిన ఉత్తరాలను చూపిస్తున్న బోగీల సాధన సమితి సభ్యులు

లక్ష్మీపురం: ప్రతి రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ విన్నవించారు. స్థానిక గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సాధారణ బోగీల సాధన కోసం ప్రధాన మంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాలు రాసే విధంగా ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ అంశాన్ని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా – టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్ ,న్యూఢిల్లీ–110011 చిరునామాకు మన బాధను, డిమాండ్‌ను అభిప్రాయాల్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141లలో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సామాజిక వేత్తలు చిలువేరు గణేష్, మూషం అనంత రాములు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

దళిత ఉద్యమ కెరటం కలేకూరి ప్రసాద్



కలేకూరి ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీమ్ సేన సేవా దళ్ సభ్యులు

నెహ్రూనగర్: కలేకూరి ప్రసాద్ దళిత ఉద్యమ కెరటమని భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. శుక్రవారం కలేకూరి ప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలేకూరి చేసిన రచనలు, పాటలతో దళిత ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. డప్పు ప్రకాష్ మాటకు కలేకూరి ప్రసాద్ పాటతోడై కారంచేడు, చుండూరు తదితర ఉద్యమాలకు బాసటగా నిలిచారన్నారు. కవిగా, సినీ గేయ రచయితగా ఎంతో పేరు ప్రఖ్యాతాలు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కలేకూరి ఆశయ సాధనకు నేటి తరం ఉద్యమ నాయకులు, దళిత, ప్రజా సంఘాలు పాటుపడాలని కోరారు. మాల ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్‌బాబు మాట్లాడుతూ దళితుల పక్షాల నిరంతరం పోరాటం చేస్తే వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమని వివరించారు. కార్యక్రమంలో కొరివి రజనీకాంత్, శ్యాంసన్, చరబండరాజు, గోపి, శేషు పాల్గొన్నారు.

భీమ్ భారత్ ఆధ్వర్యంలో..

విద్యార్థి దశ నుంచే అగ్రవర్ణ భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన పోరాట యోధుడు కలేకూరి ప్రసాద్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సమాజంలో దళిత ధిక్కార కవిగా, ప్రజా పాటల రచయితగా, దళిత విప్లవ ఉద్యమ కారుడిగా, కారంచేడు, చుండూరు దళిత పోరాటాలకు ఆకర్షితుడై అనేక రకాల బాధ్యతలను స్వీకరించారన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చిన్నం డేవిడ్ విలియమ్స్, ఆర్.కమల కుమారి, బి.అనిల్‌బాబు, డి.రాధాకృష్ణ, బి.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.